

కోడూరి విద్యావతి

"మళ్ళీ ఎవర్నయినా ప్రేమిస్తే?" మధ్యాహ్నం నిద్ర లేచి బద్ధకంగా అవులిస్తూ అనుకుంది సరోజ. కానీ ఎవరున్నారు ప్రేమించడానికి? తన్ను తానే ప్రశ్నించుకుంది. సరోజకి పదహారేళ్ళొచ్చినప్పటినుంచీ ఎవర్నో ఒకర్ని ప్రేమిస్తూనే వుంది. కానీ వచ్చిన చిక్కల్లా అందులో ఏ ఒక్కటీ ఫలించలేదు. నిజానికి తన ప్రేమ ఫలించాలని ఆమె ఎప్పుడూ సీరియస్‌గా అనుకోనూలేదు. అందుకే ఒక ప్రేమ ఫలించకపోయినా ఆమె హృదయాన్ని పగలగొట్టుకొనేదికాదు. ప్రేమ వైఫల్యం ఆమె ప్రేమించే హృదయాన్ని మరింత బలీయం చేసేది.

ప్రస్తుతం ఆమె ప్రేమకు ఆలంబన ఎవరూలేరు. ఇన్నాళ్ళూ ఆమె ప్రేమించిన హరీష్‌కి పెళ్ళి కుదిరిందని తెలియడంతో ఆమె ప్రేమకు •ఆటంకం ఏర్పడింది. ఇంకా ఎవర్ని ప్రేమించాలో తేల్చుకోలేదు ఆమె. అందుకే నిద్ర లేవగానే ఆమె ముందు ఈ సమస్య నిల్చింది - 'ఎవర్ని ప్రేమించాలి?' అని. ఇన్నాళ్ళూ ఆమె అందమైన వాళ్ళనే ప్రేమించింది. 'నా ప్రేమను పొందే అర్హత ఎవరికుంది?'—పరిచయస్థుల నందరినీ గుర్తు తెచ్చుకుంది సరోజ. ఎవరూ దృష్టికి అందలేదు. సరే ఎలానూ ఇంకా క్రొత్త ప్రేమికుడు ఫిక్స్ కాలేదు కాబట్టి, పాత ప్రేమికుల్నే మరోసారి తల్చుకుంది సరోజ.

ఆమె మొదటి ప్రేమికుడు ఆమె మేనమామ సత్యం. అతన్ని ప్రేమించాలని ఆమె ఎప్పుడూ అనుకోలేదు. కానీ వాళ్ళ నాన్న 'అమ్మాయ్, సత్యం మా(వయ్యను చేసుకుంటావా?' అని అడిగినప్పట్నుంచీ కాబోయే మొగుణ్ణి ప్రేమిస్తే బావుంటుందనుకుంది. క్లాసు పుస్తకాలకంటే కథల పుస్తకాలంటేనే ఎక్కువగా ఇష్టపడే సరోజ, ఆ కథల్లో నాయికల్లాగానే కాబోయే భర్తను ప్రేమించాలనే నిర్ణయానికి వచ్చింది. అతను ఆమెవైపు చూస్తే సిగ్గునభినయించేది. అతనేవన్నా అడిగితే షోగ్గా, నాజూగ్గా సమాధానమిచ్చేది.

పెళ్ళయ్యాక హనీమూన్‌కి బృందావన్ గార్డెన్స్ కెళ్ళాలనీ. అదేదో సినిమాలోలాగా అతని ఒళ్ళో తల పెట్టుకొని, అతని కళ్ళల్లోకి చూస్తూ చిలిపిగా నవ్వాలనీ, అతని ఉంగరాల జుట్టును చిందరవందర చేసి కిలకిలలాడాలనీ, తమకు పుట్టిన మొదటి పిల్లవాడికి కృష్ణకిషోర్ అని పేరు పెట్టుకోవాలనీ ఎన్నెన్నో ఊహించుకొనేది. కానీ తల్లి ఒక రోజు సరోజను

పిల్చి "కట్నం ఇవ్వకుండా నిన్నొ దుల్చుకుందామని మీ నాన్న వాణ్ణి చేసుకోమంటున్నాడే పిచ్చిదానా! వాడికి లేని అవలక్షణం లేదనుకో. తాగుతాడు. ముండల్తో తిరుగుతాడు. రామ రామ! చెప్పాలంటే అంతుండదు వాడి లక్షణాలు. శుభ్రంగా చదువుకుని డాక్టరై. ఆ తర్వాత నీకు నచ్చినవాణ్ణి చేసుకుందువుగాని. మీ నాన్న చేసుకోమన్నా ఒప్పుకోకు" అని చెప్పడంతో మేనమామపట్ల అంత వరకూ పెంచుకున్న ప్రేమ కరిగి పోయింది. కానీ తర్వాత తెలిసింది, తల్లి అన్న దుర్గుణాలేమీ అతనికి లేవనీ, అతన్ని చేసుకోకుండా చూడడంకోసం అలా చెప్పిందనీను.

సరోజ రెండవ ప్రేమికుడు అరుణకాంత్. అప్పుడే ఉదయిస్తున్న సూర్యుడిలాగా చల్లగా చూసేవాడు అరుణకాంత్. అతను నల్లటివాడు, అయినా అతన్లో ఓ విధమైన ఆకర్షణ ఉండేది. పి.యు సి. తర్వాత వేసవి సెలవుల్లో తండ్రి స్నేహితుడి ఆఫీసులో టైపిస్టుగా చేరినప్పుడు అరుణకాంత్‌తో పరిచయమయింది. ఇక చదవడం మానేసి, అరుణకాంత్‌ని చేసుకుంటేనో అనుకునేది. కానీ మాటల సందర్భంలో ఒకరోజు అతను మరేదో తక్కువ కులానికి చెందినవాడని తెలుసుకుంది. 'హయ్యో! చూసి చూసి వీణ్ని ప్రేమించానేమిటి? ఇంకా నయం. ముందే తెలిసింది. అనుకుని ఆ ప్రేమకు ఫుల్‌స్టాప్ పెట్టేసింది సరోజ.

వేసవి సెలవులయ్యాక బి.ఎ.లో జాయిన్ అయింది. ఎవర్ని చూసినా ప్రేమించా లనిపించేది. కొన్నాళ్ళు అందర్నీ పరిశీలించాక ఎవర్నో ఒకర్ని 'ఛూజ్' చేసుకుందామనుకుంది. ఆ తర్వాత కాలేజీలో వక్తృత్వపు పోటీలు జరగడం. పోటీలో ఫస్టు ప్రయిజు వచ్చిన జయరాంను తన ప్రేమికుడుగా ఎన్నుకొనడం జరిగింది.

జయరాంను 'మాట్లాడిస్తేనో' అనుకుంది. దగ్గరికెళ్లి 'హలో జయరాంగారూ, కంగ్రాట్యులేషన్సండీ! చాలా బాగా మాట్లాడారు.' అని అభినందించింది.

'థేంక్సండీ' సిగ్గుపడుతూ సమాధానమిచ్చాడు. 'స్టేజిమీద ఉపన్యాసం ఇచ్చేటప్పుడు వుండే ధైర్యం ఆడపిల్లల్తో మాట్లాడేటప్పుడు ఎగిరి పోతుందేమో' నవ్వుకుంది. రూంలో పడుకుని పుస్తకం చదవబోతే జయరాం రూపమే పేజీలో కన్పించేది. బియ్యే అయ్యాక అతను కన్పించ

దంటే బాధ కల్గింది. ఆమె ప్రేమ జయరాంకు తెలీనేతెలీదు. ఆటో గ్రాఫ్ అడిగిందతణ్ని. 'విత్ బెస్ట్ విషెస్' అని సంతకం పెట్టాడు. ఓ రోజు పోస్టులో అతని వెడ్డింగ్ కార్డు వచ్చేవరకూ అతని సంతకం వున్న పేజీ తీసి ముద్దుపెట్టుకుంటూ వుండేది.

ఆ తర్వాత యం. ఏ. లో జాయినయిన సరోజకు తన క్లాస్‌మేట్సందరిలోనూ డూండీ నచ్చాడు. డూండీ మార్వాడీ కుర్రాడు. సరోజకి ఫస్టు మార్కు వస్తే అతనికి సెకెండ్ మార్కు వచ్చేది.

'మిమ్మల్ని మించిపోదామంటే మించలేక పోతున్నానండీ' అనేవాడు నవ్వుతూ.

'మార్కుల్లో మించకపోయినా మాటల చమత్కారంతో ఎదుటి వాళ్ళను డౌన్ చేయగలరు మీరు' ప్రతిగా ఆమె కూడా అతన్ని మెచ్చుకొనేది. మార్వాడీ అబ్బాయి కావడంవలన చిదిమితే పాలు కారేలా వుండేవాడు. ఎప్పుడైనా బీచి ఒడ్డుకు వెళ్లి కూర్చున్నా ఇండో-అమెరికన్ రిలేషన్స్ గురించి, సైనో-సోవియట్ రిఫ్ట్స్ గురించీ మాట్లాడుకునేవారుగానీ ప్రేమ గురించి మాత్రం కాదు. క్వాలిటీలో ఐస్‌క్రీమ్ తిన్నా, ఎ.పి హాల్లో సినిమా చూసినా, ద్వారకా హోటల్లో లంచి చేసినా అన్నిటికీ అతనే పే చేసేవాడు.

'నే నతన్ని ప్రేమిస్తున్నాను' అని అనుకునేది ఖాళీగా కూర్చున్నప్పుడల్లా. 'అతన్ని చేసుకుంటే బాగానే వుంటుందిగానీ అమ్మ ఒప్పుకుంటుందా?' అనుకునేది. ఆ తర్వాత తెలిసింది డూండీకి అప్పటికే పెళ్ళయిపోయిందని. 'ఇంకా నయం. హద్దులు మీరాను కాను' తన్ను తానే ప్రశంసించుకుంది.

తర్వాత ఆమె ప్రేమించిన వ్యక్తి హరీష్. అతను ఆనందా హోటల్ ప్రొప్రయిటర్. తండ్రితో కొన్నిసార్లు, ఫ్రెండ్స్‌తో చాలా సార్లు అతని హోటల్ కెళ్లింది. వెళ్లినప్పుడల్లా ఎంతో తెలిసిన వాడిలాగా నవ్వేవాడు. 'నీకు తెలుసేమిటే అతను?' అడిగేవారు ఆమె ఫ్రెండ్స్. రోజుకోసారైనా అతన్ని చూస్తే బావుణ్ణనిపించేదిగానీ రోజూ హోటల్ కెళ్తే బావుండదని తన కోరికను అదుపులో పెట్టుకొనేది. ఓ రోజు సినిమా కెళ్తే తన ప్రక్కన ఎవరో వచ్చి కూర్చున్నారు. 'ఎవరా?' అని చూస్తే హరీష్! నవ్విందామె. అతను కూడా బదులుగా నవ్వాడు. వసంత 'మై ఫియాన్సీ' తన ప్రక్కనున్న అమ్మాయిని చూపించాడు. 'సన్నజాజి తీగలా బావుంది' వసంత మనస్సులో మెచ్చుకుని పైకి ప్రతి నమస్కారం చేసింది

రీళ్లు అయిపోయి దృశ్యం ఆగిపోయింది. మునపటి సమస్య మళ్లీ కళ్లముందు నిల్చింది. పెద్ద ప్రశ్నార్థకం మార్కుతో.

"అమ్మాయ్ సరోజా!" తండ్రి పిలుపు విన్పించింది తన ఆలోచనలకు బ్రేకుగా.

"ఏం'విటి నాన్నా?"

"అదేనమ్మా! ఇన్నాళ్ళూ మీ అమ్మ నువ్వు బాగా చదువుకున్నాకే పెళ్లి అనేది. 'ఇప్పుడు యం.ఎ. అయిపోయింది కదా, ఇక పెళ్లి చేస్తే మంచిది' అని గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. అందుకే సీరియస్‌గా నీకు పెళ్లి సంబంధాలు వెదికేస్తున్నాము. రెడీగా వుండాలి." ఏకధాటిగా చెప్పేసాడు తండ్రి.

ఆ రోజు సాయంత్రం పెళ్లి చూపుల కొచ్చాడు సుధీర్. 'అందగాడే' అనుకుంది సరోజ అతన్ని చూడగానే. "కూతురు డాక్టర్ కాకపోయినా అల్లుడయినా డాక్టరొచ్చాడని అమ్మకి సంతోషమౌతుంది. చేసేసుకుందాం" అనుకుంది, చేసుకునే ముందు కొన్నాళ్ళు ప్రేమిస్తే బావుణ్ణనుకుంది గానీ, పెద్దలందరూ ముహూర్తం పెట్టించెయ్యడంతో అల్లరి చెయ్యకుండా బుద్ధిగా తలవంచి తాళి కట్టించేసుకుంది.

శోభనం నాటి రాత్రి సుధీర్ సరోజ నడిగాడు. "పెళ్లికి ముందు నువ్వెవర్నయినా ప్రేమించావా' అని. "ఆఁ! సత్యాన్నీ, అరుణ కాంత్‌నీ, డూండీని, జయరామ్‌ని, హరీష్‌నీ ప్రేమించాను. మిమ్మల్ని ప్రేమిద్దామనుకుంటే తీరా పెళ్లి అయిపోయింది. మరి మీ రెంత మందిని ప్రేమించారు?" తిరుగు ప్రశ్న వేసింది.

"నేనా! నీ కంటే ఎక్కువ మందినే. రాధని, మాధవినీ, కాత్యాయన్నీ, కనకదుర్గనీ, నీరజనీ, రోహిణినీ,సావిత్రినీ ప్రేమించాను ఇప్పుడు నిన్ను ప్రేమించాలి" అన్నాడు, "మనకేం ఖర్మ ప్రేమించుకునేవరకూ! పెళ్ళి అయిపోయిందిగా హాయిగా!" అంది సరోజ.

'అవును. మనకు ప్రేమను మించింది దొరికిందికదా! ఇక ఆ ప్రేమ గొడవెందుకు పోనీయ్' అంటూ కౌగిట్లో బిగించాడు సరోజను. కౌగిట్లో బిగించిన సరోజకు సత్యం ఎట్సెట్రాలు మిథ్యగా, సుధీర్ ఒక్కడే వాస్తవంగా కన్పించాడు. పెళ్ళి ముందు అనవసరంగా వాళ్ళను ప్రేమించాను. ముందే సుధీర్ తెలిస్తే ముందు నుంచే ఇతన్ని ప్రేమించి వుండేదాన్ని' అనుకుంది, ప్రేమను మించిన అనుభవం లభ్యం కావడంతో, సరోజ జీవితమంతా సుధీర్ ఆక్రమించడంతో ఇతరులు ఆమె ఊహల్లోకి కూడా రాలేదు తర్వాత ●